క్లుప్తంగా

పార్కులను ఆహ్లాదంగా తీర్చిదిద్దాలి


శానిటేషన్ సెక్రటరీలకు సూచనలిస్తున్న కమిషనర్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మున్సిపల్ పార్కులను ఆహ్లాదభరితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని శానిటరీ సెక్రటరీలను కమిషనర్ నయీమ్ అహ్మద్ ఆదేశించారు. సోమవారం పట్టణంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న వివేకానంద ఉద్యానవనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆర్అండ్‌బీ సర్కిల్, పాతబస్టాండ్ ఏరియాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

గొర్రెలకు నట్టల నివారణ మందు

గుంతకల్లు రూరల్: మండలంలోని మొలకలపెంట గ్రామంలో సోమవారం గొర్రెలకు నట్టల నివారణ మందును పంపిణీ చేశారు. సర్పంచ్ మురహరినాయుడు ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ సహాయకుడు వి.భూపతి గ్రామంలోని గొర్రెల మంద వద్దకు వెళ్లి జీవాలకు నట్టల నివారణ మందు తాపించారు. ఈ సందర్భంగా ఆయన మందు ప్రాముఖ్యతపై కాపరులకు వివరించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


ఉస్మాన్

తాడిపత్రిటౌన్: రాష్ట్రస్థాయి కబడీ పోటీలకు ఉస్మాన్ ఎంపిక అయినట్లు తాడిపత్రి మున్సిపల్ బాయ్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నటరాజ్ సోమవారం తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి ఉస్మాన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం


పాతకోటలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే వార్డుల్లో పర్యటిస్తున్నట్లు ఎమ్మెల్యే జేసీ.అస్మిత్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక పోరాట కాలనీలో అధికారులతో కలసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు డ్రైనేజీలు, వీధిలైట్ల సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు పరిష్కరించాలని అక్కడే ఉన్న కమిషనర్ శివరామకృష్ణ, విద్యుత్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

గస్తీ ముమ్మరం చేయాలి

యాడికి(పెద్దవడుగూరు): రాత్రి పూట గస్తీ ముమ్మరంగా చేపట్టాలని తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు పోలీసు సిబ్బందికి సూచించారు. సోమవారం పెద్దవడుగూరు పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో మట్కా, పేకాట, అసాంఘిక కార్యక్రమాలు, గొడవలు లేకుండా చూడాలన్నారు. ఫ్యాక్షన్ గ్రామాల్లో పోలీసు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. రౌడీషీటర్ల కదలికలను రోజూ గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సీఐ ఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం


ఉత్తర కాలువకు నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జయరాం

పామిడి: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. సోమవారం పెనకచెర్ల డ్యాం నుంచి పామిడి ఉత్తర కాలువకు నీరు విడుదల చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు.మరమ్మతుల దృష్ట్యా ఉత్తర కాలువకు వదలాల్సిన 3000 క్యూసెక్కుల నీటికిగాను 1800 క్యూసెక్కులు విడుదల చేస్తామన్నారు. త్వరలో పెనకచెర్ల డ్యాంతో పాటు ఉత్తర కాలువకు మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో సాగునీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్, మండల కన్వీనర్ ముసలిరెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కత్రిమల ప్రభాకర్‌చౌదరి, మాజీ ఎంపీటీసీ బొల్లు శ్రీనివాసులురెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గుంతకల్లు: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 13 మంది లబ్ధిదారులకు రూ.6.16 లక్షల విలువచేసే చెక్కులు ఎమ్మెల్యే అందజేశారు.

ప్రీమియం చెల్లిస్తేనే పరిహారం

- రైతులపై ఇన్సూరెన్స్ ప్రీమియం భారం
- అడ్రస్ లేని అన్నదాత సుఖీభవ
- కూటమి ప్రభుత్వంపై రైతుల మండిపాటు

గుంతకల్లు రూరల్: అధికారంలోకి వచ్చాక అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏటా రూ.20 వేల రూపాయలు రైతుల ఖాతాల్లో జమచేస్తానని వాగ్దానం చేసిన కూటమి సర్కార్ ఇచ్చిన హామీని నెరవేర్చక పోగా రైతులపై అదనంగా ఇన్సూరెన్స్ ప్రీమియం భారం మోపేందుకు సిద్ధమైంది. దీంతో రైతన్నలు కూటమి సర్కార్‌పై మండిపడుతున్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల పాటు రైతుల తరఫున ప్రీమియం చెల్లించి ఆదుకుంది. దానికి తోడు పెట్టుబడి సాయం కింద రైతుల ఖాతాల్లో ఏటా రూ.13,500 జమచేస్తూ వచ్చింది. ఇటీవల కూటమి సర్కార్ రాష్ట్రంలో కొలువుదీరడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రైతులకు ఏటా రూ.20 వేలు అందజేస్తామని హామీ ఇచ్చిన కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదు. ఖరీఫ్ సాగుకు రెండు నెలల ముందే కూటమి సర్కారు కొలువుదీరడంతో అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తారని, పంటల సాగుకు ఎటువంటి ఇబ్బంది ఉండదని ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతన్నల ఆశలు అడియాసలయ్యాయి. కనీసం రబీ సీజన్ సమయానికన్నా ఇస్తారేమో అనుకుంటే అదీ లేకుండా చేశారు. దీంతో ఉసూరుమన్న రైతన్నలు పంటసాగులో పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ ఏడాది రబీ సీజన్ నుంచి ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలంటూ కూటమి ప్రభుత్వం మరోమారు రైతులను ఇబ్బంది పెట్టేందుకు సిద్ధమైంది. ప్రీమియం చెల్లింపునకు డిసెంబర్ 15 తుది గడువు విధించింది. రుణాలు రెన్యువల్ చేసుకుంటే తప్ప ప్రీమియం కట్టించుకోమని బ్యాంకర్లు తెగేసి చెబుతుండటంతో.. రుణాల చెల్లింపు రైతులకు తలకు మించిన భారంగా మారింది. అసలే అప్పులు చేసి పంటలు సాగు చేపట్టిన తాము ఇప్పుడు రుణాలను రెన్యువల్ ఎలా చేయగలమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


వేరుశనగ

పంట	రైతు కట్టవలసిన ప్రీమియం (హెక్టారుకు)	చివరి తేదీ	పథకం పేరు
పప్పుశనగ	రూ.1,125	15.12.2024	పీఎఫ్‌బీవై
వరి	రూ.1,575	31.12.2024	పీఎఫ్‌బీవై
జొన్న	రూ.788	15.12.2024	పీఎఫ్‌బీవై
మొక్కజొన్న	రూ.1,313	15.12.2024	పీఎఫ్‌బీవై
వేరుశనగ	రూ.1,200	15.12.2024	పీఎఫ్‌బీవై
టమోటా	రూ.4.000	15.12.2024	వాతావరణ ఆధారిత బీమా

ప్రీమియం చెల్లింపు అదనపు భారం



గత ఐదేళ్లుగా పంటసాగుకు ముందు పెట్టుబడి నిధి అందుకున్న రైతులకు కూటమి ప్రభుత్వం కొలువయ్యాక ఆ సహాయం అందకుండా పోయింది. దీంతో అప్పులు చేసి పంటసాగు చేపట్టాం. ఇన్సూరెన్స్ ప్రీమియం కూడా గత ప్రభుత్వమే చెల్లించగా, ఈ ప్రభుత్వం రైతులనే కట్టమంటుంది. అసలే ఇబ్బందుల్లో ఉన్న రైతులకు ఇప్పుడు ప్రీమియం చెల్లింపు అనేది అదనపు భారంగా మరింది.

– జయరాముడు, రైతు, చింతలాంపల్లి

రుణాలు రెన్యువల్ చేయాలంటున్నారు



వర్షాభావం కారణంగా గత ఏడాది పంటలు చేతికి అందకపోవడం, ప్రభుత్వం నుంచి రావాల్సిన పెట్టుబడి సహాయం కూడా అందకపోవడంతో ఈ ఏడాది చాలామంది రైతులు రుణాలు రెన్యువల్ కూడా చేయలేదు. బయటి వ్యక్తుల వద్ద అప్పులు చేసి పంటసాగు చేపట్టారు. ఇప్పుడు ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టాలంటే ముందు రుణాలను రెన్యువల్ చేయాలని బ్యాంకు వాళ్లు చెబుతున్నారు.

– జగదీశ్వర్, రైతు, గుంతకల్లు

'అన్నదాత సుఖీభవ' ఎప్పుడో?



అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏటా రైతన్నలకు రూ.20 వేలు అందజేస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఇంతవరకూ పథకం ఊసేలేదు. హామీల ఆశ జూపి అధికారంలోకి రావడం, వచ్చాక ఇచ్చిన హామీలను అమలుచేయకుండా కాలాన్ని నెట్టుకురావడం టీడీపీకి అలవాటుగా మారింది. – రాము, రైతు, పాతకొత్తచెరువు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

గుత్తి/బుక్కరాయసముద్రం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎస్ఐ సురేష్ అన్నారు. గుత్తి పట్టణంలోని కస్తూర్బా బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ఆర్డీటీ ఏటీఎల్ నారాయణ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల ఎన్నో అనర్థాలు కలుగుతాయన్నారు. 18 సంవత్సరాలు పూర్తయ్యే వరకు బాలికలకు వావాహాలు చేయకూడదన్నారు. ఏసీడీపీఓ నాగమణి, ఆర్డీటీ ట్రాన్స్‌పోర్ట్ డైరెక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ లింగ వివక్ష చూపకూడదన్నారు. అనంతరం బెలూన్ క్రీడ , వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఓ రుద్రాక్ష, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బుక్కరాయసముద్రం మండలంలోని కొర్రపాడులో ఉన్న ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో గ్లోబల్ అయోడిన్ డిఫిషియన్సీ డిజార్డర్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ ఆడ పిల్లలకు చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో సీహెచ్ మోహన్, పర్వీన్, శ్రీదేవి, లక్ష్మిదేవి, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.


గుత్తిలో మాట్లాడుతున్న ఎస్ఐ సురేష్

ఎన్నికల హామీలు అమలు చేయాలి

యాడికి(పెద్దవడుగూరు): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. సోమవారం పెద్దవడుగూరు మండల కేంద్రంలోని షాదీఖానాలో పెద్దవడుగూరు సీపీఐ మండల కార్యదర్శి వెంకటరాముడు యాదవ్, ఆ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు అందించాలన్నారు. గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసి సీపీఐ పార్టీని బలోపేతం చేస్తామన్నారు. మణిపూర్‌లో మహిళలపై దాడులు, అత్యాచారాలు ఘటనలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు సూర్యనారాయణ రెడ్డి, రంగయ్య, పోలా రంగస్వామి, నారాయణ, లింగన్న, ఏఐటీయూసీ మండల కార్యదర్శి హుసేన్ పీరా, రంగనాయకులు, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

భూ సమస్యలు పరిష్కరిస్తాం

యాడికి/యల్లనూరు/పామిడి: రీ–సర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించడమే రీ సర్వే గ్రామసభల ముఖ్య ఉద్దేశమని యాడికి తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి అన్నారు. సోమవారం యాడికి మండలంలోని కుందనకోట, రాయల చెరువు రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌కుమార్‌తో కలసి గ్రామసభలు నిర్వహించారు. అలాగే యల్లనూరు మండలంలోని మల్లాగుండ్ల, మేడికుర్తి గ్రామాల్లో ఆర్ఐ చిన్న నారాయణమ్మ ఆధ్వర్యంలో రెవిన్యూ రీ సర్వే గ్రామసభలను నిర్వహించారు. పామిడి మండలంలోని జీఏ కొట్టాల, పాగరూరులో తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి ఆధ్వర్యంలో సభలు నిర్వహించారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

గార్లదిన్నె: గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామీణ పేదల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రం గార్లదిన్నె బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ గ్రామీణ పేదల సంఘం నాయకులు ర్యాలీ చేశారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. అలాగే తాగునీటి సమస్య పరిష్క రించాలన్నారు. యర్రగుంట్లలో 5వ డిస్ట్రిబ్యూటరీ కాలువ బ్రిడ్జి లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే బ్రిడ్జి నిర్మించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఈరమ్మకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం జిల్లా కన్వీనర్ నాగభూషన్, అజయ్‌రెడ్డి, ఓబిలేసు, రామక్రిష్ణ,ఓబిలేసు, కృష్ణారెడ్డి, విశ్వనాథ్ వర్మ, వెంకటేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యతపై దృష్టి సారించాలి


శిక్షణ పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంతకల్లు: నైపుణ్యతను అభివృద్ధి పరచుకుంటే భవిష్యత్తులో విద్యార్థులు రాణిస్తారని ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ సూచించారు. కళాశాలలో బజాజ్ పిన్ సర్వే సంస్థ ఆధ్వర్యంలో గత 40 రోజుల పాటు బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్‌పై డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో మందుకు సాగితే ఉజ్వల భవితకు బాటలు వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సురేష్ బాబు, కెరియర్ ప్రమోషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వరప్రసాద్ అధ్యాపకులు పి.శ్రీనివాసులు, డాక్టర్ గోపీ, వెంకటేశ్వర్లు, డాక్టర్ శ్రావణి, డాక్టర్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

బుక్కరాయసముద్రం: పట్టణాభివృద్ధిలో యువత కీలకమని భారతీయ ప్రమాణాల బ్యూరో డిప్యూటీ డైరెక్టర్ అఖిల్ దరువు, ఏపీఎస్‌సీ చైర్మన్ ఎంఎల్ఎస్ దేవకుమార్ అన్నారు. సోమవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం, ఐఈఐ భారతీయ ప్రమాణాల బ్యూరో సంయుక్తంగా ప్రపంచ ప్రమాణాల దినోత్సవం, షేర్డ్ విషన్ ఫర్ ఎ బెటర్ వరల్డ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రపంచ సహకారాన్ని ప్రోత్సహించడంలో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో ప్రమాణాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం పట్టణ ప్రణాళికలో యువత సహకారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ రామక్రిష్ణారెడ్డి, కోఆర్డినేటర్ రఘు బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, సివిల్ డిపార్ట్‌మెంట్ అధిపతి డాక్టర్ వెంకటరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దేవకుమార్

ఫిట్నెస్ పోటీలు


ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఏడీఆర్ఎం

గుంతకల్లు: పట్టణంలోని ధర్మవరం రైల్వే గేట్ సమీపంలోని ఫిట్నెస్ జిమ్ సెంటర్‌లో సోమవారం ఇంటర్ జిమ్ బాడీ బిల్డింగ్ పోటీలను నిర్వహించారు. దాదాపు 20 మంది బిల్డర్స్ పాల్గొని తమ ప్రతిభను చాటారు. ముఖ్యఅతిథిగా ఏడీఆర్ఎం సుధాకర్ హాజరై బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ ట్రైనర్ గోపీ, నిర్వాహకులు నూర్, మున్న, జిమ్ నిర్వాహకుడు భాస్కర్ రావు పాల్గొన్నారు.

వసతి గృహాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గుంతకల్లు రూరల్: స్థానిక ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన బాలికల వసతి గృహ సముదాయాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ గైనకాలజిస్ట్ బి.సరోజమ్మ సూచించారు. సోమవారం కళాశాలలో వసతి గృహసముదాయాన్ని ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థిని డాక్టర్ బీ.సరోజమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వసతిగృహం ఏర్పాటుకు రూ.లక్ష విరాళంగా అందజేసిన ఆమెను ప్రిన్సిపాల్ లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కళాశాల విద్యార్థినులకు గైనిక్ సమస్యలుంటే ఉచితంగా వైద్యసేవలు అందజేస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఓబులేసు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పొలంలో యువకుడి మృతదేహం

గార్లదిన్నె: కనంపల్లి క్రాస్ సమీపంలోని 44వ జాతీయ రహదారి పక్కన పొలంలో ఓ యువకుడు మృతదేహం లభించింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటన వివరాలను ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా సోమవారం వెల్లడించారు. పామిడి మండలం పాళ్యంకు చెందిన మధు (28)కు చిన్నవడుగూరుకు చెందిన అనితతో ఏడాది కిందట వివాహమైంది. ఇప్పటి వరకు పిల్లలు కలగకపోవడంతో భార్యాభర్తలు ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శనివారం అనంతపురం ఆస్పత్రిలో మరోసారి వైద్యపరీక్షలు చేయించుకుని బయల్దేరిన మధు ఇంటికి చేరుకోలేదు. సోమవారం కనంపల్లి క్రాస్ సమీపంలో హైవే పక్కన ద్విచక్రవాహనం, పొలంలో మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహం వద్ద పురుగుమందు డబ్బా, ద్విచక్రవాహనంలో మెడికల్ రిపోర్టులు లభించాయి. వీటి ఆధారంగా మృతుడు పాళ్యం నివాసి మధుగా గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. సంతానలేమి కారణంతో ఆత్మహత్య చేసుకున్నాడా.. లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

గొర్రెల పట్టివేత

శింగనమల: జలాలపురం వద్ద బొలెరో వాహనంలో అపహరించుకుపోతున్న ఎనిమిది గొర్రెలను పోలీసులు పట్టుకున్నారు. సీఐ కౌలుట్లయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జలాలపురం వద్ద పోలీసులు గస్తీ విధులు నిర్వహిస్తున్నారు. పోలీసుల వాహన సైరన్ వినిపించడంతో గొర్రెలు అపహరించుకు వెళ్తున్న దుండగులు అప్రమత్తమయ్యారు. గొర్రెలను వదిలేసి వాహనంలో ఉడాయించారు. ఆ గొర్రెలను స్టేషన్‌కు తీసుకొచ్చారు. బాధితులు స్టేషన్‌కు వచ్చి ఆధారాలు చూపి తీసుకెళ్లాలని సీఐ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

23, 25న 'అంగన్‌వాడీ' ఇంటర్వ్యూలు

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఏడు అంగన్‌వాడీ, ఆయా పోస్టులకు ఈ నెల 23, 25న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ షాజిదాబేగం సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 18న నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలు భారీ వర్షాల కారణంగా వాయిదా పడడంతో.. ఈనెల 23న అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో, 25వ తేదీ గుంతకల్లులోని ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

గుంతకల్లు: స్థానిక మార్కెట్ యార్డు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా పట్టణంలోని పలు ఏరియాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.నాగేంద్ర సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని రాజేంద్రనగర్, ఎస్ఎల్‌వీ థియేటర్ ఏరియా, రామస్వామి టెంపుల్ ఏరియాతోపాటు సత్యనారాయణపేటలో ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకూ కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

చౌడేశ్వరీ అమ్మవారి గుడిలో చోరీ

పుట్లూరు: మండలంలోని నారాయణరెడ్డిపల్లి సమీపంలో ఉన్న చౌడేశ్వరీ ఆలయంలో ఆదివారం హుండీలో ఉన్న నగదు, ఇత్తడి దీపాలను ఓ దొంగ చోరీ చేశాడు. వాటి విలువ దాదాపు రూ.18వేలు ఉంటుందని పూజారి నారాయణరెడ్డి తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఏఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఆలయం వద్ద సీసీ కెమెరాలు ఉండటంతో చోరీ చేసిన వ్యక్తి నాయకునిపల్లి గ్రామానికి చెందిన యువకుడిగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించాలి

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఎస్ కర్నూల్ రోడ్డులో ఆక్రమణలను పూర్తి స్థాయిలో తొలగించాలని ఎస్ఎస్ పల్లి మహిళలు సోమవారం కమిషనర్ జబ్బార్‌మియాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ పల్లి మహిళలు రోజా రమణి (లాయర్), విజయలక్ష్మి, రంగమ్మ, సునీత, సరళ తదితరులు మున్సిపల్ కమిషనర్‌ను కలసి సమస్య విన్నవించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామంలో అనారోగ్య సమస్యల కారణంగా భారతి అనే వివాహిత సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

గుత్తి రూరల్: మండలంలోని వన్నేదొడ్డి గ్రామంలో నాగేంద్ర అనే రైతు పాము కాటుతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. సోమవారం పొలంలో కలుపు పనులు చేస్తుండగా రైతు చేతికి పాము కాటు వేసింది. వెంటనే అతడిని కుటుంబ సభ్యులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

తాడిపత్రిటౌన్: మండలంలోని బుగ్గ, వెంకటాంపల్లి, తిమ్మేపల్లి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జీపీఎంఓఓ మధుసూధన్‌రాజు కంటీ పరీక్షలు నిర్వహించారు. దాదాపు 106 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 9 మందికి కంటి అద్దాలు అవసరం అని గుర్తించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి, హరినాథ్‌రెడ్డి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు మరువలేనివి


బుక్కరాయసముద్రం మండలంలోని పోలీస్ బెటాలియన్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి


యాడికి మండలం రాయలచెరువుల రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న డీఎస్పీ రామకృష్ణుడు


గుంతకల్లులో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఆర్ఐ రామాంజనేయులు


గుత్తి ఆర్ఎస్‌లోని జీఆర్‌పీ స్టేషన్‌లో అమర వీరుల వారోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం/గుంతకల్లు/గుత్తి/యాడికి: పోలీసులు సేవలు మరువలేనివని ఎమ్మెల్యే బండారు శ్రావణి అన్నారు. సోమవారం బుక్కరాయసముద్రం మండలంలోని జంతలూరు సమీపంలో ఉన్న 14వ ఏపీఎస్పీ పోలీసు బెటాలియన్‌లో అమర వీరుల స్మారక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఏపీఎస్పీ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ ప్రభుకుమార్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎంతో మంది పోలీసులు ప్రాణాలు లెక్క చేయకుండా ప్రజల ప్రాణాలు కాపాడారన్నారు. అనంతరం అమర వీరుల స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసాద్‌కుమార్, ఆర్ఐ బాషా, ఆర్ఐలు నాగేంద్రబాబు, మహబూబ్‌బాషా, ప్రదీప్‌కుమార్, పసులపు శ్రీరామిరెడ్డి, బెటానియన్ యూనియన్ నాయకులు పెద్దయ్య బెటాలియన్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- గుంతకల్లు పట్టణంలోని జీఆర్‌పీ ఎస్పీ కార్యాలయంలో పోలీసుల అమరవీరుల సంస్మరణ దినం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపం వద్ద జీఆర్‌పీ ఆర్ఐ రామాంజనేయులు అమరులైన పోలీసులకు నివాళులర్పించారు. జీఆర్‌పీ ఎస్పీ సీసీఎస్ చిన్నరాయుడు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- గుత్తి ఆర్ఎస్‌లోని జీఆర్‌పీ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ నాగప్ప ఆధ్వర్యంలో సోమవారం పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.
- యాడికి మండలంలోని రాయలచెరువు లయన్స్ క్లబ్ కార్యాలయంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆర్డీటీ సహకారంతో లయన్స్ క్లబ్ సభ్యులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 65 మంది రక్త దానం చేశారు. కార్యక్రమంలో సీఐ ఈరన్న, పోలీసు సిబ్బంది, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సూర్యనారాయణ, సభ్యులు, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టండి

గుత్తి రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో అపరిశుభ్రత పేరుకుపోయిందని, పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ సూచించారు. సోమవారం పట్టణంలోని కార్యాలయంలో ఎంపీడీఓ సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పర్యటించి కాలువలు, రోడ్లపై ఉన్న చెత్త, చెదారాన్ని తొలగించాలన్నారు. ఈఓఆర్డీ శివాజీరెడ్డి, కార్యదర్శులు ధనలక్ష్మి, సుమలత, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాల పరిశీలన

పుట్లూరు: మండలంలోని చింతకుంటలో సోమవారం నిర్వహించిన పంట కోత ప్రయోగాలను తహసీల్దార్ శేషారెడ్డి పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతు నారాయణస్వామి వేరుశనగ పొలంలో పంట కోత ప్రయోగాలను చేపట్టగా 2.15 కిలోల దిగుబడి వచ్చినట్లు ఏఎస్ఓ విజయకుమార్ వివరించారు.

శ్రీసార్థ జ్ఞానేశ్వరి గ్రంథం అందజేత

పామిడి: మండలంలోని తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపీడీఓ తేజోత్స్న తదితరులకు సోమవారం భావసార క్షత్రియ భజన మండలి ఆధ్వర్యంలో శ్రీసార్థ జ్ఞానేశ్వరి తెలుగు అనువాద గ్రంథం అందజేశారు. దేవాలయాల అధ్యక్షుడు, కవి నారాయణమూర్తి, భజన మండలి అధ్యక్షుడు మురళి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

గుత్తి: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు, కార్యకర్తలు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. సీపీఐ మండల కార్యదర్శి రామదాసు మాట్లాడుతూ మున్సిపాలిటీలో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయన్నారు. కనీస సదుపాయలు లేవన్నారు. ఎక్కడ చూసినా చెత్త చెదారం , అపరిశుభ్రత పేరుకుపోయిందన్నారు. చెత్త కుండీలు సరిపడినన్ని లేవన్నారు. డ్రైనేజీ కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజు యాదవ్, మధు, నరసింహులు, వెంకటరాముడు, నజీర్, డానియల్, రామకృష్ణ, మల్లి కార్జున తదితరులు పాల్గొన్నారు.